సాక్షి నారాయణపేట

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



జగజ్జనని..
అలంపూర్ జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.
-10లో ▸



జూరాలకు భారీగా వరద
జూరాల జలాశయానికి శనివారం భారీగా వరద రాగా.. 31 గేట్లు తెరిచి దిగువకు వదిలినట్లు అధికారులు వివరించారు.
-10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.7 /22.5
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

దరఖాస్తు చేసుకోండి

నారాయణపేట టౌన్: మైనార్టీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు పథకాలను ప్రారంభించిందని.. అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎంఏ రషీద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకం ద్వారా వితంతులు, విడాకులు పొందిన వారికి, అనాథలు, అవివాహిత మహిళలు చిన్నపాటి వ్యాపారాలు నిర్వహించుకునేందుకు రూ. 50వేల చొప్పున సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా రేవంతన్న కా సహారా మిస్కీన్ ద్వారా ఫకీర్, దూదేకుల వర్గాలకు మోపెడ్ వాహన సౌకర్యం కల్పించేందుకు రూ. లక్ష గ్రాంట్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆయా పథకాలకు అర్హులైన వారు వచ్చే నెల 6వ తేదీలోగా tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చేనేత, జౌళీశాఖ ఏడీఓ విజయ్ కుమార్ అన్నారు. గాంధీనగర్‌లో చేనేత కార్మికులు నిర్మించుకున్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు సొసైటీ సభ్యత్వం కల్పించాలని కోరుతూ కొన్నేళ్లుగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ, టీయూసీఐ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం చేనేత, జౌళీశాఖ ఏడీఓ గాంధీనగర్‌కు చేరుకొని కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ మాస్‌లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని హ్యాండ్లూమ్ వీవర్స్ సొసైటీకి చెందిన 4,267 మంది చేనేత కార్మికులు నిర్మించుకున్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయ కుండా, సొసైటీలో సభ్యత్వం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్, జౌళీశాఖ అధికారుల దృష్టికి తీసుకురావడంతో జౌళీశాఖ ఏడీఓ నేరుగా గాంధీనగర్‌కు వచ్చి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ పట్టణ కార్యదర్శి నారాయణ, వెంకట్రాము లు, సాదిక్, సలీం పాల్గొన్నారు.

వేతన వ్యథ..

అతిథి అధ్యాపకులకు 8 నెలలుగా అందని జీతాలు

- గత డిసెంబర్ నుంచి పెండింగ్
- నెలల తరబడి వేతనాలు అందక అవస్థలు
- జిల్లాలో ఈ విద్యా సంవత్సరం 22మంది మాత్రమే రెన్యువల్
- మరో 22మంది పరిస్థితి అయోమయం



మద్దూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఎనిమిది నెలలుగా వేతనాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఓవైపు వారిని పూర్తిస్థాయిలో రెన్యువల్ చేయకపోవడం.. మరోవైపు నెలల తరబడి వేతనాలు అందించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 8–10 ఏళ్లుగా పనిచేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషిచేసిన ఎంతో మంది అతిథి అధ్యాపకులను ఈ విద్యా సంవత్సరం రెన్యువల్ చేయకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ అధ్యాపకులను నియమించడంతోనే అతిథి అధ్యాపకుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని పలువురు వాపోతున్నారు.



భూనీడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాబోధన చేస్తున్న అతిథి అధ్యాపకుడు

22మంది మాత్రమే రెన్యువల్..

జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. గత విద్యా సంవత్సరం వరకు 44 మంది అతిథి అధ్యాపకులుగా పనిచేశారు. ఈ ఏడాది మాత్రం 22మందిని మాత్రమే ప్రభుత్వం రెన్యువల్ చేసింది. మిగతా 22 మంది స్థానంలో రెగ్యులర్ అధ్యాపకులను నియమించారు. కాగా, అతిథి అధ్యాపకులకు రెండు, మూడు నెలలకోసారి వేతనాలు చెల్లిస్తారు. అయితే గత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చితో పాటు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు అందకపోవంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్కరు ప్రతినెలా 72 క్లాస్‌లు చెప్పాల్సి ఉండగా.. ఒక్కో క్లాస్‌కు వారికి రూ.390 చొప్పున రూ. 28,080 వేతనం అతిథి అధ్యాపకులకు అందించాల్సి ఉంది.

అమలుకు నోచుకోని హామీలు..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అతిథి అధ్యాపకులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు 12 నెలల పాటు రూ. 42వేల చొప్పున వేతనం అందించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. అయితే ప్రభుత్వం ఏర్పాటై 20 నెలలు గడిచినా హామీలను అమలు చేయకపోవడంతో అతిథి అధ్యాపకులు ఆవేదన చెందుతున్నారు. హామీలను అమలు చేయకపోయినా ఉద్యోగాలను రెన్యువల్ చేయాలని వేడుకుంటున్నారు.

కుటుంబ పోషణ భారంగా మారింది..



ప్రభుత్వం కొన్ని నెలలుగా వేతనాలు అందించకపోవడంతో అవస్థలు పడుతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి.
– బాల్‌రాజ్, అతిథి అధ్యాపకుడు, గుండుమాల్

ఉద్యోగ భద్రత కల్పించాలి..



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొన్నేళ్లుగా పనిచేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నాం. తమకు నెలల తరబడి వేతనాలు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి.
– మధుసూదన్‌రెడ్డి, అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర కోశాధికారి

ప్రొసీడింగ్ విడుదల..



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్స్, ఇతర సిబ్బందితో కలిపి మొత్తం 970 మంది వేతనాలపై ప్రభుత్వం ప్రొసీడింగ్ విడుదల చేసింది. అందులో దాదాపు 398 మంది అతిథి అధ్యాపకులు కూడా ఉన్నారు. ప్రస్తుతం ఇంటర్ బోర్డు పరిశీలనలో ఉంది. త్వరలోనే అతిథి అధ్యాపకులకు వేతనాలు అందే అవకాశం ఉంది.
– సుదర్శన్‌రావు, డీఐఈఓ

పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు



అమ్మిరెడ్డిపల్లి పాఠశాలలో పీటీఎం సమావేశం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు
- నేటి నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు

నారాయణపేట రూరల్: దసరా సెలవుల నేపథ్యంలో శనివారం ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. తల్లిదండ్రులు విధిగా సమావేశాలకు హాజరయ్యేలా ముందస్తు చర్యలు చేపట్టారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారుల ఆదేశాల మేరకు 'సంతోషకరమైన, సురక్షితమైన దసరా సెలవులు' అంశంపై అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశమై పలు సూచనలు చేశారు. జిల్లాలోని 337 ప్రాథమిక, 86 యూపీఎస్, 75 ఉన్నత పాఠశాలలు, 11 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, రెండు మోడల్ స్కూళ్లలో పీటీఎం సమావేశాలను విజయవంతంగా పూర్తిచేశారు. సమావేశాల నిర్వహణ తీరును ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పర్యవేక్షించారు.

ప్రోత్సాహం అందించాలి..
పీటీఎం సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు బాల్యంలో దసరా పండుగ ఎలా నిర్వహించుకున్నారు.. ఆ రోజుల్లో వారు చేసిన సాహసాలు, అనుభవాలను తెలుసుకున్నారు. బతుకమ్మ వేడుకల్లో పిల్లలను భాగస్వాములను చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. దసరా సెలవులను ఆనందంగా గడిపేలా ప్రోత్సహించాలని తెలిపారు. సెలవుల తర్వాత వచ్చే పరీక్షలకు కూడా సన్నద్ధమయ్యేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ముఖ్యంగా చెరువులు, కుంటలు, వాగుల వద్దకు పిల్లలు ఒంటరిగా వెళ్లనివ్వొద్దని తెలిపారు. రోజుకో గంటపాటు చదివేలా చూడాలన్నారు. పర్యావరణహితంగా దసరా పండుగ నిర్వహించుకునేలా మార్గదర్శనం చేయాలని కోరారు. అదే విధంగా పిల్లల బేస్‌లైన్ పరీక్ష, నిర్మాణాత్మక పరీక్షలు, ప్రిమీడ్ లైన్ పరీక్షల ఫలితాలను తెలియజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. హాజరుశాతం తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడి.. గైర్హాజరుతో కలిగే నష్టాలను వివరించారు.

విద్యార్థుల ఇంటిబాట

రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలల విద్యార్థులు దాదాపు 13 రోజుల పాటు ఇంటి వద్దే ఉండనున్నారు. వచ్చే నెల 4వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో వసతిగృహాల్లో ఉండే చిన్నారులు శనివారం మధ్యాహ్నం నుంచే స్వగ్రామాలకు బయలుదేరారు.



సింగారం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

పిల్లలను ఒంటరిగా వదలొద్దు..



జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు నిర్వహించి.. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేశారు. సెలవుల సందర్భంగా సూచనలు అందించారు. ప్రభుత్వం విద్యాసంస్థలకు దసరా సెలవులు ఇచ్చినందున విద్యార్థులు ఇళ్ల వద్దే ఉంటారు. వారు రోజు గంటపాటు చదువుకునేలా చూడాలి. ఒంటరిగా పొలాలు, చెరువుల వద్దకు పంపరాదు.
– గోవిందరాజు, డీఈఓ

ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాన్ని ప్రతిబింబించే బతుకమ్మ సంబరాలను శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ముందస్తుగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. బతుకమ్మ వేడుకలతో పాఠశాలలన్నీ సందడిగా మారాయి.

- వివరాలు 11లో..



మొగుల్‌మడ్క పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

దసరాకు ప్రత్యేక బస్సులు



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

- రీజియన్ వ్యాప్తంగా 641 అదనపు సర్వీసులు
- వచ్చేనెల 2 వరకు నడవనున్న ఆర్టీసీ
- హైదరాబాద్ రూట్లో ఎక్కువ స్థాయిలో రాకపోకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈ ఏడాది దసరా పండుగను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ రీజియన్‌లో 641 ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసులు తిరగనున్నాయి. రీజియన్‌లోని పది డిపోల నుంచి ఈ అదనపు బస్సులు శనివారం ప్రారంభం కాగా.. వచ్చే నెల 2వ తేదీ వరకు నడపనున్నారు. దసరా పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని మహబూబ్‌నగర్ రీజియన్‌లోని డిపోల నుంచి అదనపు సర్వీసులు నడపనున్నారు.

రీజియన్ వ్యాప్తంగా..
దసరా పండుగను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ రీజియన్ వ్యాప్తంగా 641 అదనపు సర్వీసులు నడవనున్నాయి. హైదరాబాద్ రూట్లో ఎక్కువ అదనపు బస్సు సర్వీసులు నడపనున్నారు. ఈ రూట్లోనే ఆర్టీసీకి అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా కర్నూలు రూట్‌లోనూ అదనపు బస్సులు నడవనున్నాయి. మహబూబ్‌నగర్ డిపో నుంచి అధికంగా 93 అదనపు బస్సులు నడపనున్నారు. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, వారి సౌకర్యార్థం అదనపు వలంటీర్లను అందుబాటులో ఉంచుతున్నారు. అదేవిధంగా తాగు నీటి వసతి, షెల్టర్లు, కూర్చోవడానికి కుర్చీలు, బస్సుల వివరాలు, సూచనలను ఎప్పటికప్పుడూ ప్రయాణికులకు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. ఆదివారం నుంచి పాఠశాలలకు సెలవులు ఉండడంతో శనివారం బస్టాండ్లలో రద్దీ కొంతమేర కనిపిస్తోంది. మరో రెండు రోజుల్లో మరింత రద్దీ పెరిగే అవకాశం ఉంది.

పెరగనున్న ఆదాయం..
దసరా పండుగ సందర్భంగా సాధారణ రోజుల కంటే మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు కొద్దిమేర ఆదాయం పెరిగే అవకాశం ఉంది. పండుగ ప్రారంభ మూడు రోజులు, ముగింపు అనంతరం రెండు రోజుల్లో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..
అదనపు సర్వీసులు

మహబూబ్‌నగర్ 93	వనపర్తి 86	గద్వాల 86
నారాయణపేట 86	షాద్‌నగర్ 67	అచ్చంపేట 60
కల్వకుర్తి 60	నాగర్‌కర్నూల్ 53	కొల్లాపూర్ 50

సద్వినియోగం చేసుకోవాలి



దసరా పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ తరఫున అదనపు బస్సులు నడపనున్నాం. బస్సు సౌకర్యాన్ని ప్రయాణికుల సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలు ఆర్టీసీని ఆదరించి బస్సుల్లో ప్రయాణించాలి.
– సంతోష్‌కుమార్, ఆర్‌ఎం, మహబూబ్‌నగర్

చంద్రగఢ్‌కు మరమ్మతు

రూ.6.50 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం సంప్‌హౌజ్

- కొత్త ప్యానల్ బోర్డులు, పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు
- టెండర్ ప్రక్రియలో ఆలస్యం
- వినియోగంలోకి రానున్న నాగిరెడ్డిపల్లి, బెక్కర్‌పల్లి ఎత్తిపోతలు
- ఉమ్మడి లిఫ్ట్ ఆయకట్టు 15 వేల ఎకరాలు

అమరచింత: నియోజకవర్గంలో అతిపెద్ద ఎత్తిపోతల చంద్రగఢ్‌కు మహర్దశ రానుంది. ఏళ్ల కిందట మరమ్మతుకు గురై ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించకుండా ఉన్న ఎత్తిపోతల మరమ్మతుపై మంత్రి వాకిటి శ్రీహరి దృష్టి సారించారు. మక్తల్ పర్యటనకు వచ్చిన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సమస్యను విన్నవించి నిధులు మంజూరు చేయాలని కోరడం.. రెండు నెలల కిందట ఆయకట్టు రైతులతో కలిసి మరో మారు సంబంధిత శాఖ మంత్రిని కలవగా మరమ్మతుకు వెంటనే రూ.6.50 కోట్లు మంజూరు చేసి ఇందుకు సంబంధించిన జీఓ పత్రాలను సైతం ఇరిగేషన్ అధికారులకు అందించారు. ప్రస్తుతం రూ.4 కోట్లు మాత్రమే మంజూరయ్యాయని.. త్వరలో మరో రూ.2.50 కోట్లు రావచ్చని వెల్లడిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..
జూరాల జలాశయం నిల్వనీటి ఆధారంగా చంద్రగఢ్, బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి 2005లో అప్పటి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో ఎత్తిపోతల కింద 5 వేల ఎకరాల ఆయకట్టును రూపొందించి సాగునీరు అందించేందుకు శ్రీకారం చుట్టారు. కాని పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాసిరకంగా చేపట్టడంతో పాటు నిర్వహణ బాధ్యతలను రైతులకు అప్పగించారు. నాణ్యత లేని పైపులు వినియోగించడంతో ఎక్కడికక్కడే పగిలి నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. ప్రతి ఏటా పైపులు పగిలి పంటలు నష్టపోయిన సందర్భా లు ఎన్నో ఉన్నాయి. గత ప్రభుత్వ హయంలో పైపుల మార్పునకు నిధులు మంజూరు చేయాలని పలుమా ర్లు ప్రతిపాదనలు పంపినా ఒక్క పైసా కూడా విడుద ల చేయలేదు. ప్రస్తుతం చంద్రగఢ్, బెక్కర్‌పల్లి ఎత్తిపో తల కింద 2,800 ఎకరాలు మాత్రమే సాగవుతుంది.

❐ నాగిరెడ్డిపల్లి, చంద్రగఢ్ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన ప్యానల్ బోర్డులు కాలిపోవడంతో వీటి స్థానంలో కొత్తవి అమర్చాల్సి ఉంది. అదేవిధంగా ఎత్తిపోతల నీటిని ఆయకట్టు రైతులకు అందించేందుకుగాను అంతర్గత పైప్‌లైన్లు వేయాల్సి ఉంది. పైపులు పగిలిపోవడం, లీకేజీలు ఏర్పడటంతో మంజూరైన నిధులతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. వీటితోపాటు అనేక చిన్న చిన్న మరమ్మతులు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాల్సి ఉందని ఆయకట్టు రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

టెండర్ల ప్రక్రియ పూర్తయితే..



చంద్రగఢ్ ఎత్తిపోతల పథకం మరమ్మతుకు ప్రభుత్వం రూ.6.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఎత్తిపోతలకు అనుసంధానంగా ఉన్న బెక్కర్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. పూర్తవగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతాం.
– జగన్మోహన్, ఈఈ, జూరాల ఎడమ కాల్వ విభాగం

నిధుల ప్రతిపాదన ఇలా..

నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించి గ్రావిటీ కెనాల్, పైప్‌లైన్ మార్చాల్సి ఉండగా.. చిన్న సంపుహౌజ్‌లు నిర్మించాల్సి ఉంది. కొత్త ప్యానల్ బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉండటంతో వీటికోసం రూ.2.85 కోట్లు ప్రతిపాదించారు.

➪ చంద్రగఢ్ ఎత్తిపోతల పథకంలో ప్యానల్ బోర్డు, పైపులైన్ మార్చేందుకు రూ.1.93 కోట్లు ప్రతిపాదించారు.

➪ బెక్కర్‌పల్లి ఎత్తిపోతల పనులకు సంబంధించి రూ.2.13 కోట్లు అవసరమంటూ అప్పట్లోనే నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు అందించారు. తాజాగా మంత్రి వాకిటి శ్రీహరికి కూడా ఇవ్వడంతో నిధులు మంజూరయ్యాయి.

'ప్రత్యేక బస్సుల పేరుతో చార్జీల పెంపు సరికాదు'



నారాయణపేట రూరల్: హిందూ పండుగలు, జాతరల సమయంలోనే ఆర్టీసీ ప్రత్యేక బస్సుల పేరుతో చార్జీలను పెంచి ప్రయాణికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధానకార్యదర్శి కన్న శివకుమార్ అన్నారు. ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు చార్జీ వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డీఎం లావణ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా, దీపావళి ఇతర పండుగల సమయంలో చాలామంది ప్రయాణికులు స్వస్థలాలకు వస్తుంటారని.. అలాంటి సమయంలో ప్రత్యేక బస్సుల పేరుతో చార్జీలను పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి పెంచిన బస్సు చార్జీలను ఉపసంహరించుకోవాలని.. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయకులు రవికుమార్‌గౌడ్, ప్రవీణ్, వడ్ల శ్రావణ్, కృష్ణ, నర్సింహ, చక్రి, శివకుమార్, రవి, శ్రీను, వెంకటేశ్, ఆకాశ్ పాల్గొన్నారు.

తిలతైలాభిషేకం

బిజినేపల్లి: నందివడ్డెమాన్‌లోని జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శనిదోష నివారణ కోసం తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. ప్రతి శనివారం కొత్తగా వచ్చే భక్తుల కోసం ఆలయ సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. అనంతరం భక్తులు బ్రహ్మసూత్ర పరమశివుడిని దర్శించుకోగా.. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్లుప్తంగా

పుట్టిన రోజే.. చివరి రోజు


సంతోష్(ఫైల్)

మరికల్: స్నేహితులతో కలి సి పుట్టిన రోజు వేడుకలను నిర్వహిం చుకున్న రోజే ఓ వ్యక్తికి చివరి రోజు కావడంతో బాధిత కుటుంబంలో తీవ్ర విషాదం నింపిం ది. పోలీసులు తెలిపిన వివరా ల మేరకు.. మక్తల్ మండలంలోని చిట్యాలకు చెందిన సంతోష్ (32) జడ్చర్లలో ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య ఎస్వీఎస్ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ మహబూబ్‌నగర్‌లో నివాసం ఉం టున్నారు. శుక్రవారం సంతోష్ పుట్టిన రోజు కావడంతో బంధువులు, స్నేహితులతో కలిసి వేడుకలను నిర్వహించుకునేందుకు మక్తల్‌కు వెళ్తానని భార్యతో చెప్పాడు. భార్య మక్తల్ వెళ్లొద్దని, మహబూబ్‌నగర్‌లోనే పుట్టిన రోజు వేడుకలను చేసుకుందామని ఎంత చెప్పినా వినకుండా బైక్‌పై వెళ్లాడు. రాత్రి మక్తల్‌లో స్నేహితులతో కలిసి జన్మదిన వేడుకలు చేసుకున్నారు. అనంతరం బైక్‌పై మహబూబ్‌నగర్‌కు వెళ్తుండగా మరికల్ మండలంలోని పెద్దచింతకుంట స్టేజీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వరీ తెలిపారు.

కుమార్తె కోసం వెళ్లి తండ్రి మృత్యువాత


మల్లయ్య (ఫైల్)

రాజోళి: పెద్దల అమావాస్య పండుగను పురస్కరించుకొని తన కుమార్తెను ఇంటికి తీసుకొచ్చేందుకు వెళ్లి తండ్రి మరణించిన ఘటనతో రాజోళిలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే రాజోళికి చెందిన మల్లయ్య (55) కుమార్తె హైదరాబాద్‌లోని ఉందానగర్‌లో ని వాసం ఉంటోంది. పెద్దల పండుగకు కుమార్తె తీసుకురావడానికి శుక్రవారం మల్లయ్య ఉందానగర్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో అదే రైల్వేస్టేషన్ పరిధిలో పట్టాలు దాటుతుండగా.. కాలు జారి పట్టాలపై పడ్డాడు. అదే సమయంలో వచ్చిన రైలు ఢీకొట్టడంతో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాజు (ఫైల్)

బిజినేపల్లి: మండల పరిధిలోని శాయిన్‌పల్లికి చెందిన చెన మోని రాజు(20) పురుగు మందు తాగి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్న రాజు ఆదివారం పురుగుమందు తాగా డు. స్థానికులు వెంటనే నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కొత్తకోట రూరల్: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కొత్తకోట మండలంలోని రామకృష్ణాపురం శివారులో చోటు చేసుకుంది. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గట్టన్న(55) కొంత కాలంగా పెబ్బేరు మండల కేంద్రంలో హమాలీగా పనిచేస్తుండేవాడు. రోజువారీ పనిలో భాగంగా శనివారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై పెబ్బేరుకు వెళ్లాడు. పని ముగించుకొని సాయంత్రం స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా నాటవెళ్లి, పామాపురం గ్రామాల మధ్యలో రోడ్డు మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడటంతో గట్టన్న అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించా రు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

జగజ్జనని.. లోక పావని

రేపటి నుంచి జోగుళాంబ శరన్నవరాత్రి ఉత్సవాలు

- నవ రూపాల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు
- అలంపూర్ క్షేత్రానికి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం


అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రం (ఇన్‌సెట్లో) ఆలయంలో కొలువుదీరిన జోగుళాంబ అమ్మవారు

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అక్టోబర్ 2వ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ దీప్తి, కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల భక్తులు భారీగా తరలిరానుండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ క్షేత్రంలో అమ్మవారిని శైలపుత్రి, బ్రహ్మచారి, చంద్రఘంట, కూష్మాండ, స్కంద, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రిగా రోజుకు ఒకరూపంలో అలంకరించి ఆరాధిస్తారు. దేవి ఆరాధనలో భాగంగా కుమారి, సువాసిని పూజ నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత.

మహాగౌరి

శరన్నవ రూపాల్లో ఎనిమిదో రూపం మహాగౌరి. ఈ అమ్మవారు ప్రపంచానికి మంగళాన్ని శాసిస్తూ ఉంటారు. ఈ అమ్మవారిని ఆరాధించడంతో సకల సౌభాగ్యాలతో పాటు మంగళం చేకూరుతుందని, సకల శుభాలు, కల్యాణప్రాప్తి చేకూరుతాయని భక్తుల నమ్మకం.

స్కందమాత

స్కందుడు అనగా కార్తికేయుడు. నవరాత్రుల్లో ఐదోరోజు అమ్మవారిని స్కందమాతగా పూజించడంతో ఒడిదుడుకులు తొలగిపోతాయి. అమ్మవారిని ఆరాధించడంతో షడ్గుణాలు, సత్ప్రవర్తన అలవడుతాయి.

బ్రహ్మచారిణి

రెండోరోజు నవదుర్గల్లో ఒకరైన బ్రహ్మచారిణి గా భక్తులు ఆరాధిస్తారు. ఈ అమ్మవారు సాధువుగా చేతిలో పుస్తకం, జపమాల, కమండలం, దండం కలిగి ఉంటుంది. ఈ మాతను ఆరాధించడంతో జీవితంలో తలెత్తే ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని పొందుతారు.

చంద్రఘంట

మూడోరోజు చంద్రఘంటదేవిగా ఆరాధిస్తారు. శిరస్సుపై చంద్రుడు అర్ధాకృతిలో ఉండటంతో చంద్రఘంటాదేవిగా పేరుగాంచారు. చేతుల్లో అస్త్ర శస్త్రాలను ధరించి ఉంటుంది. ఈ అమ్మవారిని ఆరాధిస్తే మంగళం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వీరులుగా, నిర్భయులుగా, సౌమ్యులుగా, సద్గుణులుగా మారుతారు.

శైలపుత్రి

శైల పుత్రి పర్వతరాజు పుత్రిక. ఈ మెను పార్వతీదేవి గా కొలుస్తారు. ఉత్సవాల్లో శైలపుత్రిని మొదటిరోజు ఆరాధిస్తారు. ఈ దేవతను ఆరాధించడంతో భక్తులు మానసిక ప్రశాంతతతో పాటు సౌమ్య స్వభావాన్ని పొందగలుగుతారు.

సిద్ధిధాత్రి

సకల సిద్ధులను ప్రసాదించే జగన్మాత చివరిరోజు సిద్ధిధాత్రిగా భక్తులకు దర్శనమిస్తారు. ఈ అమ్మవారిని ఆరాధిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని, శుభ ఫలితాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

కుష్మాండదేవి

నవదుర్గల్లో ఒకరైన కూష్మాండాదేవిగా అమ్మవారిని నాలుగోరోజు ఆరాధిస్తారు. కుష్మాండం అంటే బ్రహ్మాండానికి సంకేతం. ఈ అమ్మవారు శాకాంబరిగా ప్రసిద్ధి చెందింది. జగన్మాత బ్రహ్మాండమంతా తానై ఉంటూ భక్తులను రక్షిస్తుంది.

కాత్యాయిని

ఆరోరోజు అమ్మవారిని కాత్యాయినిగా భక్తులు పూజిస్తారు. ఈ అమ్మవారు వ్యాఘ్ర వాహిణిగా (పులిని వాహనంగా ధరించి) భక్తులకు దర్శనమిస్తుంది. ఈ దేవత కైంకర్య ప్రియురాలు. దేవి ఆరాధకులు కాత్యాయిని దేవిని శరణు వేడుతూ నవరాత్రుల్లో అమ్మవారికి దశ మహా విద్యలను ఆచరిస్తారు. ఈ అమ్మవారిని ఆరాధించడంతో అనుష్టానపరులకు అతీతమైన శక్తులు ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

కాళరాత్రి

నవరాత్రుల్లో ఏడోరోజు అమ్మవారిని కాళరాత్రి దేవిగా పూజించడం ఆనవాయితి. నల్లటి రూపాన్ని ధరించి ఆకాశంలో ఉండే మబ్బుల రంగును కలగలుపుకొని అతి భీకరంగా ఉంటుంది. రాక్షస సంహారం కోసం గార్దవాన్ని వాహనంగా చేసుకొని అసుర సంహారం చేస్తోంది. అమ్మవారు చెడును ధ్వంసం చేసే విలయకారిణిగా మహిమాన్విత మూర్తిగా భక్తులకు దర్శనమిస్తారు.

ప్రైవేటు కంపెనీలో కార్మికుడి ఆత్మహత్య

నవాబుపేట: మండలంలోని కాకర్‌జాల్, చౌడూర్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే కార్మికుడు నివాసం ఉండే ప్రాంతంలోనే శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనపై ఇంకా పోలీసులకు ఫిర్యాదు అందలేదని పోలీసులు వివరించారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న కంపెనీలోనే రెండు నెలల కిందట కంపెనీలో పనిచేసే ఇంజినీర్ మృతిచెందాడు. అతడు పడుకున్న చోటే మృతిచెందగా మద్యం అతిగా తాగి మృతిచెందినట్లు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు అందింది. కాగా తాజాగా ఆత్మహత్యకు పాల్పడిన మోహన్ (25) యూపీకి చెందిన వాడని తెలిసింది. గతంలో మృతిచెందిన వ్యక్తి కూడా యూపీకి చెందిన వాడే కావడం విశేషం. కాగా ఈ కంపెనీలో యూపీ, బీహార్, ఒరిస్సాకు చెందిన వారే ఉండడంతో సమాచారం బయటికి పొక్కడంలేదు. ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఉంచడంపై కాకర్‌జాల్, చౌడూర్ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనలు చూస్తున్న తమకు భయాందోళన కలుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఘటనపై ఎస్ఐ విక్రమ్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

సైబర్ దాడి: రూ.70వేలు మాయం

నాగర్‌కర్నూల్ క్రైం: బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.70వేలు చోరీ చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని రాంనగర్‌కాలనీకి చెందిన పిట్టల రవి వాట్సాప్‌కు ఆర్టీఓ చలాన్ పేరిట ఏపీకే ఫైల్ రావడంతో అతడు లింక్‌ను క్లిక్ చేశారు. సైబర్ నేరగాళ్లు పిట్టల రవి ఫోన్ హాక్ చేసి బ్యాంక్ అకౌంట్‌లోని రూ.70వేలు లూటీ చేశారు. బ్యాంక్ అకౌంట్‌లో నగదు డ్రా చేసినట్లు మెసేజ్‌లు రావడంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శక్తి పీఠంలో పవిత్రోత్సవం


జోగుళాంబ అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేస్తున్న సిబ్బంది


అలంపూర్ క్షేత్రానికి అఖండ జ్యోతితో తరలివస్తున్న భక్తులు

అలంపూర్/ఉండవెల్లి: అలంపూర్ జోగుళాంబదేవి ఆలయంలో శనివారం పవిత్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం సాయంత్రం 6.30 గంటల వరకు ఆలయాన్ని శుద్ధి చేశారు. దేవీ శరన్న వరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో పవిత్రోత్సవం నిర్వహించినట్లు అర్చక స్వాము లు తెలిపారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పూజలు యథావిధిగా కొనసాగాయి.

- జోగుళాంబ ఆలయంలో జరిగే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈఓ దీప్తి, ఆలయ ధర్మకర్తలు ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో కలిసి ఆహ్వానించారు.

అలంపూర్‌కు అఖండ జ్యోతి..

మహారాష్ట్రలోని సౌత్ సోలాపూర్‌లోని వడగావ్‌లో వెలసిన శ్రీ సిద్ధేశ్వరి శక్తి మందిర్ నుంచి అలంపూర్ జోగుళాంబ క్షేత్రానికి అఖండ జ్యోతిని తరలిస్తున్నారు. 400 కి.మీ. నుంచి భక్తులు అఖండ జ్యోతిని తీసుకొస్తున్నారు. ఈ అఖండజ్యోతి శనివారం బొంకూరుకు చేరింది.

కల్వకుర్తిలో కలకలం

- డబ్బుల కోసం భార్యాభర్తలు, ప్రియురాలు కలిసి పన్నాగం
- రూ.కోట్లు కొల్లగొట్టడంతో వ్యవహారం బయటకు..

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తికి చెందిన భార్యాభర్తలు, ఓ మాజీ ప్రియురాలు కలిసి న్యూడ్ వీడియోలతో రూ.కోట్లు కొల్లగొట్టిన వ్యవహారం స్థానికంగా కలకలం రేపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ వ్యవహారం బయటపడింది. కల్వకుర్తిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన భార్యాభర్తలు మల్లేష్, మేరీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మాజీ ప్రియురాలు మల్లికతో కలిసి ఈజీమనీ సంపాదించాలని కుట్ర పన్నారు. ఈ మేరకు మకాం కర్నూలుకు మార్చి, అక్కడి ప్రముఖులను మాటలతో వారిని న్యూడ్‌కాల్స్‌తో బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. రోజురోజుకు డబ్బులను ఎక్కువగా సంపాదించాలన్న అత్యాశతో ఏకంగా వారే పలువురితో ఏకాంతంగా గడిపిన వీడియోలను భర్తే తీసి వీరి వద్దకు వచ్చిన వారిని బెదిరించడం ప్రారంభించి ఎక్కువ డబ్బులను సంపాదించారు. ఈ క్రమంలో వీరి వద్దకు వచ్చిన వారిలో వ్యాపారి ప్రదీప్ వద్ద రూ.కోట్లలో డబ్బులు తీసుకొని, అతను డబ్బులు అడిగినప్పుడల్లా బుకాయిస్తుండటంతో అనుమానం వచ్చి కర్నూలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. ఈ మేరకు నిందితులను సాంకేతిక పరిజ్ఞానంతో కల్వకుర్తిలో పట్టుకొని కర్నూలుకు తరలించి రిమాండ్‌కు పంపించారు.

అత్యాశకు పోయి మోసపోవద్దు..



న్యూడ్ కాల్స్ వ్యవహారంలో అపరిచిత వ్యక్తులతో మాట్లాడి చాలావరకు మోసపోతున్నారని, పరువు కోసం భయపడి ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. అత్యాశకు పోయి చాలా మంది వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సైబర్ నేరాలు, న్యూడిటీకి సంబంధించి పలు అవగాహన కార్యక్రమాలు నిత్యం చేపడుతున్నాం. ఇలాంటి సందర్భాల్లో ప్రజలు నిర్భయంగా బయటకు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో గాని, సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలి.

– వెంకటరెడ్డి, డీఎస్పీ, కల్వకుర్తి

మత్తులో పాలిటెక్నిక్ విద్యార్థిపై దాడి

- ఐసీయూలో చికిత్స పొందుతున్న వైనం

మహబూబ్‌నగర్ క్రైం: పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిపై నలుగురు యువకులు కలిసి దాడి చేశారు. అయితే తాగిన మైకంలోనా..లేక గంజాయి మత్తులో దాడి చేశారా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. తీవ్రంగా గాయపడిన విద్యార్థి ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్య కథనం ప్రకారం.. భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామానికి చెందిన సాయి చరణ్ మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఈనెల 16న సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సాయి చరణ్ తన నలుగురు స్నేహితులతో కలిసి పాలిటెక్నిక్ కళాశాల నుంచి బస్టాండ్‌కు వస్తున్న క్రమంలో బండ్లగేరి చౌరస్తాలో నలుగురు యువకులు అడ్డగించి మాకు టీ తాగడానికి డబ్బులు ఇవ్వాలని వాళ్లను అడిగారు. దీంతో ఆ విద్యార్థులు తమ వద్ద డబ్బులు లేవని చెప్పారు. అదే సమయంలో సాయి చరణ్ నడుచుకుంటూ కొంత ముందుకువెళ్లాడు. దీంతో నలుగురు యువకులలో ఒకడు అతనిని అడ్డగించి దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం సాయిచరణ్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, దాడి చేసిన నలుగురిని సీసీ కెమెరాల సహాయంతో ఇప్పటికే గుర్తించామని సోమవారం రిమాండ్‌కు తరలిస్తామని ఎస్ఐ తెలిపారు. ప్రాథమిక విచారణలో అయితే మద్యం మత్తులో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుదారుడి ఆరోపణ మేరకు సదరు నలుగురిని అదుపులోకి తీసుకున్న తర్వాత అందరికీ.. గంజాయి టెస్ట్ చేస్తామని వెల్లడించారు.

జూరాలకు భారీగా వరద


జూరాల ప్రాజెక్ట్ 31 క్రస్టు గేట్ల ద్వారా శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

- 2.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్ట్ 31 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు: కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి భారీగా వరద చేరుతున్నట్లు శనివారం పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్ట్‌కు 2.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 2.39 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 31 క్రస్టు గేట్లను ఎత్తి 2.14 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 6 యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగుతుంది. విద్యుదుత్పత్తికి 28,734 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 68 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 580 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2.46 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.415 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆల్మట్టిలో 128 టీఎంసీల నిల్వ

ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీ ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఆల్మట్టి ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా ప్రస్తుతం 128 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 27,726 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న నారాయణపూర్‌కు 30,585 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 33.12 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 4 గేట్లను ఎత్తి దిగువన ఉన్న జూరాలకు ప్రాజెక్టుకు 1.19 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సుంకేసులకు స్వల్ప ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతుంది. శనివారం ఎగువ నుంచి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. రెండు గేట్లను మీటర్ మేర ఎత్తి 11,238 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కేసీ కెనాల్‌కు 2,626 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక నుంచి వరద భారీగా చేరుతుండడంతో జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగంగా సాగుతుంది. ఈ మేరకు 6 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 349.048 ఎంయూ, దిగువలో 370.154 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 715.982 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. జూరాలకు అత్యధికంగా వరద చేరుతుండటంతో దిగువ ఉత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

'మృతదేహం తరలింపులో నిర్లక్ష్యం లేదు'

మన్ననూర్: లింగాల మండలం ఈర్లపెంటకు చెందిన మెండ్లీ గురువమ్మ మృతదేహాన్ని అధికారుల సూచన మేరకే ఫరహాబాద్ చౌరస్తా వద్ద ఉంచడం జరిగిందని 108 ప్రోగ్రాం మేనేజర్ టి.శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 రోజుల క్రితం మెండ్లీ గురువమ్మ అనారోగ్యంతో మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిందని.. గురువారం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందిందన్నారు. ఐటీడీఏ అధికారుల సూచన, సమన్వయంతో మృతదేహాన్ని మార్చురీ వాహనంలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మన్ననూర్ వరకు తరలించినట్లు పేర్కొన్నారు. అయితే అక్కడి నుంచి ఈర్లపెంటకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదనే సమాచారం అందడంతో పాటు మరో మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి బల్మూర్‌కు తరలించాలని అధికారుల నుంచి పిలుపు రావడంతో.. ఏటీడీఏ అధికారుల సమన్వయంతో మరో వాహనంలో మృతదేహాన్ని తరలిస్తామన్న సూచన మేరకే ఉదయం 4:30 గంటలకు మృతదేహాన్ని ఫరహాబాద్ వద్ద ఉంచడం జరిగిందన్నారు. అయితే వాహనం దొరక్కపోవడంతో కొంత ఆలస్యమైందని.. సుమారు 6గంటలకు ఫరహాబాద్ చౌరస్తా వద్దకు వాహనంతో చేరుకొని మృతదేహాన్ని ఈర్లపెంటకు తరిలించినట్లు వివరించారు. ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో పాటు అధికారుల సూచన మేరకే మార్చురీ వాహనం పైలెట్, ఐటీడీఏ అధికారి నడుచుకున్నారని.. ఇందులో ఎవరి నిర్లక్ష్యం లేదని ఆయన తెలిపారు.

సొంతూరికి పయనం..




పాఠశాలలకు దసరా సెలవులు రావడంతో శనివారం నుంచే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గురుకులాలు, కేజీబీవీలు, వసతిగృహాల్లోని విద్యార్థులు స్వగ్రామాలకు బయలుదేరడంతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడాయి.

– సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

నిజాముద్దీన్ మృతదేహాన్ని తీసుకొస్తాం


నిజాముద్దీన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు: నిజాముద్దీన్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా తీసుకొచ్చేలా ఇప్పటికే విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో మాట్లాడానని ఎంపీ డీకే అరుణ అన్నారు. అమెరికా పోలీసు కాల్పుల్లో మృతిచెందిన నిజాముద్దీన్ కుటుంబాన్ని జిల్లాకేంద్రంలో శనివారం ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. నిజాముద్దీన్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ సంఘటన విషయం తెలిసిన వెంటనే బాధిత తల్లిదండ్రులు, విదేశీ వ్యవహారాలశాఖ అధికారులతో మాట్లాడానని, ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ కమిటీకి లేఖ రాశానని చెప్పారు. నిజాముద్దీన్ ఘటనపై తల్లిదండ్రులు, మాకు చాలా అనుమానాలు ఉన్నాయని, ఈ ఘటనకు ముందు నిజాముద్దీన్ తన లింక్డ్ ఇన్ ఖాతాలో ఏదో ఆఫీసులో వేధిస్తున్నట్లు రాసుకున్నట్లు తెలిసిందన్నారు. అయితే ఏదైనా తప్పుచేసి ఉంటే శిక్షించాలి కానీ, కాల్చి చంపాల్సిన అవసరం ఏముందని, ఈ విషయమై విచారణ జరిపేలా కాన్సులేట్ జనరల్‌తో మాట్లాడుతానని చెప్పారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చదువుకోవడానికి అమెరికాకు వెళ్లి మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న నిజాముద్దీన్ అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. అతడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

మాజీమంత్రి పరామర్శ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అమెరికా పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన నిజాముద్దీన్ కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాముద్దీన్ మృతదేహాన్ని అమెరికాలోని తెలుగు అసోసియేషన్ అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నేతలను సంప్రదించి పాలమూరుకు రప్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆదివారం మృతదేహాన్ని ఇండియాకు తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.